ప్రజాశక్తి
సోమవారం 23 అక్టోబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు

సివిల్స్ రెండో దశ పరీక్షకు 503 మంది హాజరు

ప్రజాశక్తి - పాడేరు : సివిల్స్ ఉచిత శిక్షణకు రెండవ దశరాత పరీక్షకు 503 మంది అభ్యర్థులు హాజరయ్యారు. సివిల్స్ ఉచిత శిక్షణకు ఆదివారం తలరిసింగి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాల, ఏపీఆర్జేసీ కళాశాలలో రెండవ దశరథ పరీక్షలు నిర్వహించారు. తలార్ సింగి పాఠశాలకు మంది 265 అభ్యర్థులను కేటాయించగా 257 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఏపీఆర్జేసీ కళాశాలకు 264 మంది అభ్యర్థులను కేటాయించగా 246 మంది అభ్యర్థులు రెండవ దశ పరీక్షకు హాజరయ్యారు.

పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

టూరిజం కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ కుంభా రవిబాబు
- సిఐటియు నాయకుల సమక్షంలో టూరిజం ఎమ్‌డితో చర్చలు
- హామీలు విస్మరిస్తే సమ్మెకు సిద్ధం : కార్మిక సంఘం నాయకులు

ప్రజాశక్తి-అరకులోయ : ఏజెన్సీ ప్రాంతంలోని ఆరు ఏపీ టూరిజం యూనిట్ల పరిధిలోని టూరిజం కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవిబాబు తెలిపారు. ఈనెల 22వ తేదీ తర్వాత ఏ రోజునైనా సమ్మెబాట పట్టవచ్చునని ఏపీ టూరిజం కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో టూరిజం కార్పొరేషన్ ఎండి కన్నబాబుకి సమ్మె నోటీసులు సమర్పించిన విషయం తెలిసిందే. సమ్మె విషయం ఎమ్మెల్సీ రవిబాబు దృష్టికి కూడా టూరిజం కార్మికులు తమ సమస్యలను వినతిపత్రం రూపంలో సమర్పించారు.ఇందుకు స్పందించిన రవి బాబు టూరిజం కార్మికులతో, టూరిజం ఎండితో మధ్యవర్తి గా వ్యవహరించి ఆదివారం సిఐటియు నాయకుల సమక్షంలో పలు సమస్యలపై చర్చించారు. టూరిజం ఎండి కన్నబాబుతో ఫోన్లో చర్చించి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను కూలం కుశంగా వివరించారు. కార్మికుల న్యాయపరమైన కోరికలు పరిష్కరించాలని ఆయనతో చర్చించగా కొన్ని సమస్యలపై సానుకూలంగా స్పందించారని రవిబాబు కార్మికులకు తెలిపారు. కార్మికులతో టూరిజం ఎండి నేరుగా కార్మికుని చర్చించే విధంగా చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. ఈ సమస్యలను పరిశీలించి పరిష్కరించడానికి కనీసం 15 రోజులు గడువు కావాలని కార్పొరేషన్ ఎండి చెప్పినట్లు రవిబాబు అన్నారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఏ రోజునైనా సమ్మెకు వెళ్లడానికి కార్మికులందరూ సిద్ధంగా ఉన్నారని కార్మిక సంఘం నాయకులు స్పష్టం చేశారు. కార్మికులతో అల్లూరి జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ కూడా కార్మిక సంఘం నాయకులతో సోమవారం చర్చించనున్నట్లు తెలిసింది. ఈ కార్యక్రమంలో అనంతగిరి సిపిఎం జెడ్పిటిసి గంగరాజు, డోకూరు సర్పంచ్ మొస్య అరకులోయ మాజీ ఎంపీపీ అరుణ కుమారి సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు, ఏపీ టూరిజం కార్మిక సంఘం నాయకులు గంగరాజు, బాబూరావు, నరసింహ, అంజలిరావు, కార్మికులు పాల్గొన్నారు.

నాయకులు, కార్మికులతో మాట్లాడుతున్న రవిబాబు

విద్యుత్ సౌకర్యం కల్పనకు వినతి

ఎంపీ మాధవికి వినతిపత్రం ఇస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని నల్లగొండ పంచాయతీ బోయఊట కొత్త వీధి గ్రామానికి విద్యుత్ సౌకర్యాన్ని కల్పించాలని ఆ గ్రామ గిరిజనులు కోరారు. ఈమేరకు స్థానిక ఎంపీ గొట్టేటి మాధవిని కలిసి వినతిపత్రం అందజేశారు. తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో అడవిజంతువులు, విషకీటకాలు, పాములు భయంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. గ్రామంలో నివసిస్తున్న వారంతా పిటిజి గిరిజనులేనని, తమ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పనకు చర్యలు చేపట్టాలని ఎంపీకి విన్నవించారు. సమస్యలపై ఎంపీ మాధవికి వినతి పత్రం అందించారు. బోయ ఊట, కొత్తవీధి గ్రామ పివిటిజి గిరిజనుల వినతిపై ఎంపీ మాధవి సానుకూలంగా స్పందించి, వీలైనంత త్వరలో విద్యుత్ సౌకర్యం కల్పనకు కృషి చేస్తానని హామీనిచ్చారు.

బాధిత కుటుంబానికి చేయూత



నిత్యావసరాలు అందజేస్తున్న ట్రస్ట్‌ప్రతినిధులు

ప్రజాశక్తి -కొయ్యూరు : ప్రమాదంలో ఇంటి పెద్దదిక్కు మరణంతో అనాథలుగా మారిన పేద కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సాయాన్ని అందజేసింది. నెలరోజులకు సరిపడా నిత్యావసరాలను బాధిత కుటుంబానికి అందజేసింది. మండలంలోని చిట్టెంపాడు పంచాయతీ గోపవరం గ్రామానికి చెందిన సెగ్గే రమణబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించాడు. దీంతో భార్య, ముగ్గురు పిల్లలతో దిక్కు తోచని పరిస్థితిల్లో బాధిత కుటుంబం ఉన్న సమాచారం తెలుసుకున్న హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు టి మల్లేష్, చింతూరులోని చేయూత వారియర్స్ ట్రస్ట్ చైర్మన్ దూనబోయిన రమణ, సభ్యుల ద్వారా గోపవరం గ్రామంలో రమణబాబు కుటుంబానికి పరామర్శించి ఓదార్చారు. బాధిత కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులు ఐదుకిలోల నూనె డబ్బా, బియ్యం, పిల్లలకు బట్టలు, కూరగాయలు అందించారు. ఈ సందర్భంగా టి.మల్లేష్ మాట్లాడుతూ చేయూత వారియర్స్ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్న రమణ టీమ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు ఏజెన్సీ లో అనేక ప్రాంతాల్లో మీ సేవలు కొనసాగాలని ఆకాక్షించారు కార్యక్రమంలో చేయూత వారియర్స్ టీమ్ సభ్యులు ఈరెల్లిరాజేష్, ఇండుగ శేఖర్, కిముడు బాలస్కర్, రమేష్, నానాజీ, లోవరాజు గ్రామపెద్దలు పెట్ల గాంధీ, బొజ్జన్న దొర, సెగ్గే జగ్గారావు, పొల్లు దొర, పాడి చిన్నపోతురాజు, రమణబాబు, కొండబాబు, రాంబాబు, శేషు యువత పాల్గొన్నారు.

మన్యంలో దసరా సందడి

-పలుచోట్ల అన్న సమారాధనలు
-ఆలయాలు కిటకిట
-నాటు కోళ్లకు గిరాకీ

ప్రజాశక్తి-పాడేరు: పాడేరు ఏజెన్సీలో విజయదశమి సందర్భంగా దేవీ నవరాత్రుల మహోత్సవాల నేపథ్యంలో సందడి నెలకొంది. పట్టణంలోని దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేకంగా దుర్గాదేవి అమ్మవారిని ప్రతిష్ఠించి నవరాత్రి మహోత్సవాలు నిర్వహిస్తున్నారు. అలాగే పాడేరు పట్టణ మెయిన్ రోడ్లో దుర్గాదేవిని ప్రతిష్ఠించి ఐదు రోజులపాటు దసరా ఉత్సవాలను చేపడుతున్నారు. ఇక్కడ రోజు కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఈ నవరాత్రి మహోత్సవాల్లో భక్తులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు పూజా కార్యక్రమాల్లో పాల్గొంటుండటంతో దసరా సందడి నెలకొంది. ఈ దుర్గాదేవి మండపాలు, మోదకొండమ్మ అమ్మవారి ఆలయం వద్ద భవాని భక్తుల సందడి నెలకొంది. ఈ దేవీ నవరాత్రుల మహోత్సవాల సందర్భంగా మెయిన్ రోడ్‌లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. 25న దుర్గాదేవి అనుపోత్సవం అదే రోజు భక్తులకు అన్న సమారాధన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఉత్సవ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శివరాత్రి నాగేశ్వరరావు, బొజ్జనాగు తెలిపారు. దుర్గాదేవి ఆలయం వద్ద ప్రతిష్ఠించిన అమ్మవారిని ఈ నెల 24న దసరా రోజున అనుపోత్సవం నిర్వహిస్తామని, అలాగే ఆలయం వద్ద వాహన, భక్తులకు కుంకుమార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు ఎన్వి ప్రసాద్ శర్మ వెల్లడించారు. దసరా ఉత్సవాల సందర్భంగా సోమ, మంగళవారాల్లో ఆలయం వద్ద భవాని భక్తులకు అన్న సమారాధన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దసరా మహోత్సవాల్ని పురస్కరించుకొని పట్టణంలో అత్యధిక రీతిలో భక్తులు భవాని మాల ధారణ చేసుకొని విజయవాడ కనకదుర్గ ఆలయానికి యాత్రలకు పెద్ద ఎత్తున సిద్ధమవుతున్నారు.

భోజనాలు వడ్డిస్తున్న నిర్వాహకులు

దసరాతో నాటు కోళ్లకు గిరాకీ..

దసరా పండగ వచ్చిందంటే ఈ ప్రాంతంలో నాటు కోళ్ళకి యమ గిరాకీ పెరుగుతుంది. ఏజెన్సీలో రైతులు ఎక్కువగా నాటు కోళ్ల పెంపకం సాగిస్తుంటారు. ఏజెన్సీలో సిసలైన నాటు కోళ్లు లభిస్తుంటాయి. దీంతో మైదాన ప్రాంతాల నుంచి సైతం ఈ దసరా సమయంలో వ్యాపారులు, వినియోగదారులు సంతలకు వచ్చి నాటు కోళ్లను కొనుగోలు చేస్తుంటారు. దీంతో, రైతులకు నాటు కోళ్ల విక్రయం ద్వారా మంచి లాభాలు వస్తుంటాయి. పట్టణంలో పలువురు గిరిజనులు పల్లెటూర్ల నుంచి తాము పెంచిన నాటుకోళ్లని తెచ్చి విక్రయిస్తున్నారు. జత పుంజు కోళ్ళు కు రూ. 4 వేల నుంచి 5 వేల వరకు ధర పలుకుతోంది. దసరా కావడంతో నాటు కోళ్ల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి.

కోడిని తీసుకొచ్చిన గిరిజనుడు

భవాని భక్తులకు అన్న సమారాధన

ప్రజాశక్తి-పాడేరు: మోదకొండమ్మ తల్లి ఆలయం వద్ద అయ్యప్ప, భవాని మాలధారణ భక్తులకు దసరా దేవి నవరాత్రులు పురస్కరించుకొని దుర్గాష్టమి సందర్భంగా ఆదివారం అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ, మణికంఠ అన్నదాన ట్రస్ట్ ఆధ్వర్యంలో దుర్గ భక్తులతో సహా వెయ్యి మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు . రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ మెంబర్ తమర్బ నరసింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలం నాయుడు, ఈ అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. ఆదివారం దుర్గాష్టమి కావడంతో అధిక సంఖ్యలో దుర్గా భక్తులు అన్నదాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కిరణ్ మణికంఠ అన్నదాన ట్రస్ట్ చైర్మన్ శివరాత్రి శ్రీనివాస్ కుమార్, సభ్యులు ముకుంద, పెనిరెడ్డి దేముడు, సీతారాం, ఆర్కే రాజు, కొండలరావు, కొట్టగుల్లి రామారావు, రమేష్ నాయుడు, బాలూ, నాగు, ఉప్పల వెంకటరత్నం, బాబురావు,పోతురాజు పాల్గొన్నారు.

కాజ్‌వే నిర్మించాలి

ప్రజాశక్తి-దుంబ్రిగుడ: మండలంలోని శీలం గోంది రోడ్డు చంప పట్టిగిడ్డ వద్ద కొట్టుకు పోయిన కాజ్ వేను పునర్మించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి.సూర్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గత 2014లో కురిసిన హుదూద్ తుఫానుకు చంపపట్టి గెడ్డ వద్ద నిర్మించిన కాజ్వే కొట్టుకు పోయిందన్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం పునాదిని నిర్మించక పోవడంతో ఆ ప్రాంతంలోని గిరిజనులు రవాణా సౌకర్యానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి కాజ్‌వేను నిర్మించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆ ప్రాంత గిరిజనులతో కలిసి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ ప్రాంత గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

నిరసన చేపడుతున్న నేతలు

టిడిపి నేతల కొవ్వొత్తుల ర్యాలీ

ప్రజాశక్తి- చింతపల్లి: చంద్రబాబు నాయుడును కక్షపూరిత కేసులతో ఇబ్బంది పెట్టడం తగదని తెదేపా మండల ఉపాధ్యక్షుడు కిముడు లక్ష్మయ్య అన్నారు. చంద్రబాబుకు సంఘీభావంగా తాజంగి పంచాయతీలోని బాసంగి కొత్తూరు గ్రామంలో ఆదివారం పార్టీ శ్రేణులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నైపుణ్య శిక్షణ ఇప్పించి వందలాది కుటుంబాలలో వెలుగులు నింపిన చంద్రబాబు నాయుడును నిరాధారమైన ఆరోపణలతో కక్షపూరితంగా అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పొత్తూరు రామ్మూర్తి, బోనంగి బంగారు పడాలు, రాజేష్, రామారావు, మధ్య రాజు బాబు, బోనంగి బెన్న లింగేశ్వరరావు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తరలిస్తున్న కుటుంబీకులు, గ్రామస్తులు

మృతదేహాన్ని డోలీలో తరలింపు

ప్రజాశక్తి-ముంచింగి పుట్టు:-మండల పరిధిలో కొండపడ గ్రామానికి చెందిన కిముడు అద్దన్న అనే వ్యక్తి అస్వస్థతతో మృతి చెందాడు. ఆ మృతదేహాన్ని గ్రామానికి డోలీలో తరలించాల్సి దుస్థితి నెలకొంది. అద్దన్న అస్వస్థతకు గురి కావడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు, గ్రామస్తుల సహాయంతో ఓ ప్రైవేటు వాహనంలో మండల కేంద్రంలో సిహెచ్సికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని గ్రామానికి తరలించేందుకు అంబులెన్స్ ఇవ్వాలని కోరగా విధుల్లో ఉన్న వైద్యుడు అంబులెన్స్ ఇవ్వడానికి నిరాకరిచారు.సిహెచ్ ఆవరణలో ఒక అంబులెన్స్ ఉన్నప్పటికీ ఇవ్వలేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. మధ్యాహ్నం మృతి చెందితే.. సాయంత్రం నాలుగు గంటలు కావస్తున్న అంబులెన్స్ ఇవ్వకపోవడంతో కుటుంబ సభ్యులకు ఏమి చేయాలో పాలుపోలేదు. గ్రామస్తుల సహకారంతో డోలి కట్టి మృతదేహాన్ని భుజాలపై ఎత్తుకొని, కాలినడకన మూడు కిలోమీటర్ల దూరంలో కొండ పడ గ్రామం వరకు మృతదేహాన్ని మోసుకొని వెళ్తున్నారు. మార్గం ఉద్యమంలో అంబులెన్స్ ను విధుల్లో ఉన్న వైద్యుడు పంపించారని తెలిపారు. అంబులెన్సు అప్పటికప్పుడు ఎలా ప్రదర్శనమయ్యాయాన్ని కుటుంబ సభ్యులు ప్రశ్నించారు. అయినప్పటికీ మృతదేహాన్ని డోలిలోనే భుజాలపై గ్రామస్తుల సహాయంతో తరలించారు. సిహెచ్ లో విధుల్లో ఉన్న డాక్టర్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు డిమాండ్ చేశారు.

వెండిని ఇస్తున్న దాతలు

దుర్గాదేవికి వెండి కిరీటం వితరణ

ప్రజాశక్తి -పాడేరు: మండలంలోని ఇరడాపల్లి గ్రామంలో దుర్గాదేవి అమ్మవారికి గ్రామంలోని భక్తురాలు నారాయణమ్మ వెండి కిరీటం తయారు చేయించి దసరా ఉత్సవాలను పురష్కరించుకొని ఆలయానికి అందజేశారు. అన్నవరం పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వహిస్తూ మందు పాతర పేలుడు దుర్ఘటనలో మృతి చెందిన కానిస్టేబుల్ అప్పన్న దొర ఇదే గ్రామానికి చెందిన వారు కావడంతో ఆయన జ్ఞాపకార్థంగా ఆలయానికి ఈ వెండి కిరీటం బహుకరించారు.కుటుంబ సభ్యులందరూ కలిసి ఆలయానికి వెళ్లారు.

ఐటిడిఎ లీగల్ సెల్ డిటిని తొలగించాలి

ఐటిడిఎ ఎదుట ఆందోళన చేస్తున్న జెఎసి నేతలు

ప్రజాశక్తి-రంపచోడవరం : బోగస్ ఎస్‌టి కుల ధ్రువీకరణల జారీకి సహకరిస్తూ, నిజమైన గిరిజనులకు అన్యాయం చేస్తునన ఐటిడిఎ లీగల్ సెల్ డిటి చైతన్యను తక్షణమే విధులు నుంచి తొలగించాలని ఆదివాసీ జెఎసి నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం రెండోరోజున ఐటిడిఎ ఎదుట ఆందోళన కొనసాగించారు.

ఈసందర్భంగా జెఎసి రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు కంగల శ్రీనివాసు మాట్లాడుతూ అల్లూరి జిల్లా, రంపచోడవరం మన్యం ప్రాంతంలో గిరిజనేతరులకు ఆదివాసీ తెగల పేరుతో బోగస్ కుల ధ్రువీకరణ పత్రాలు పొంది విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయ వ్యాపార రంగాలలో లబ్ధిపొందేలా సహకరిస్తున్న చైతన్యను వెంటనే విధుల నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. చైతన్యకు మద్దతుగా నిలుస్తున్న రంపచోడవరం ఐటిడిఎ పిఒను కూడా కమిషనరేట్‌కు సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. బోగస్ సర్టిఫికెట్లు రద్దు చేసే వరకు నిరసన దీక్ష కొనసాగిస్తామని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా కొమరం భీం జయంతిని పురస్కరించుకుని నివాళులర్పించారు. కార్యక్రమంలో జెఎసి నేతలు కారం రామన్న దొర, చవలం శుభకృష్ణ దొర, కొమరం సూర్యచంద్రం దొర, సోళ్ళ బొజ్జి రెడ్డి, కుండ్ల కృష్ణ రెడ్డి, మట్ల కృష్ణ,పోడియం పండు దొర, కానెమ్ విజయలక్ష్మి, బి.అదిరెడ్డి,జె.జగ్గిరెడ్డి ,సన్యాసి రెడ్డి, కుంజం వెంకన్న దొర, బొరగా పొట్టిదొర, శరపు కృష్ణమూర్తి, మడి చిన్నాలుదొర, శారపు శ్రీను, ప్రవీణ్ పాల్గొన్నారు.

150 మందికి వైద్యసేవలు

ప్రజాశక్తి - రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల అధ్వర్యంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించి నట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. .ఈ వైద్య శిభిరంలో డాక్టర్ దాసరి ఉమామహేష్, డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ ఎస్.సంపత్ కుమార్ పాల్గొని 150 మందికి వైద్యసేవలు అందించారు. వీరిలో 39 మందికి రక్తపరీక్షలు, ఆరుగురికి థైరాయిడ్ పరీక్షలు, ఏడుగురికి ఎక్స్‌రేలు, ఏడుగురికి ఫిజియోథెరపీ నిర్వహించారు. ప్రతివారమూ అందిస్తున్న రామకృష్ణ మిషన్ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని స్వామీజీ కోరారు. క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు. రోగులు, సహాయకులుకు భోజన సదుపాయం కల్పించినట్లు స్వామీజీ తెలిపారు.

ఎక్సరే రిపోర్ట్‌ను పరిశీలిస్తున్న డాక్టర్

వైద్యసేవల్లో నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి -సీలేరు: వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎపి జెన్కో వైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని అదే సంస్థకు చెందిన ఉద్యోగి పి. నారాయణరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు .సీలేరు కాంప్లెక్స్ ముఖ్య ఇంజనీర్ బి. శ్రీధర్‌కు ఫిర్యాదు చేశానన్నారు. రెగ్యులేటరీ డ్యాం విధి నిర్వహణలో ఉండగా, ఉదయం ఆరుగంటలకు పిచ్చికుక్క దాడి చేసి తనను తీవ్రంగా గాయపరిచిందన్నారు. విషయాన్ని క్యాంపు ఎడిఇ సురేష్‌కు తెలియజేసి, ఆయన సూచనల మేరకు ఉదయం 7 గంటలకు ఆసుపత్రికి వైద్యానికి వెళ్లానన్నారు. అక్కడ వైద్య సిబ్బంది ప్రథమ చికిత్స చేశారన్నారు. వైద్యాధికారి 9.30 గంటలకు రాగా, విషయాన్ని అయనకు చెప్పగా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆరోపించారు. దీనిపై పరిశీలన జరిపి తగు చర్యలు తీసుకోవాలని నారాయణరావు డిమాండ్ చేశారు.

ఆసుపత్రిలో వైద్యసేవలకు ఎదురుచూస్తున్న నారాయణరావు

బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి- కొయ్యూరు: ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలను అందుకున్న గిరిజన రైతులకు రుణాలు మంజూరు చేసి ఆదుకోవాలని మండలంలోని రాజేంద్రపాలెం సర్పంచ్ పీటా సింహాచలం కోరారు. పంచాయతీ పరిధిలోని సోలాబు, కొత్తవీధి, రాజేంద్రపాలెం గ్రామాలకు చెందిన 19మంది రైతులకు రాజేంద్రపాలెం సర్పంచ్ పీటా సింహాచలం అటవీ హక్కు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ సింహాచలం మాట్లాడుతూ, పట్టాలు పొందిన రైతులు వాటిని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. అటవీహక్కు పట్టాలు పొందిన రైతులకు బ్యాంకు రుణాలు మంజూరుకుఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో విఆర్ఒ సత్యనారాయణ, వాలంటీర్లు రమణ, రాజు పాల్గొన్నారు

గ్రామీణ వైద్యుల సమావేశం

సమావేశంలో పాల్గొన్న గ్రామీణ వైద్యుల సమావేశం

ప్రజాశక్తి-చింతూరు : ఎటపాక మండలంలోని శ్రీఆదిత్య స్కూల్‌లో ఆదివారం గ్రామీణ వైద్యుల సమావేశం జరిగింది ఈ సమావేశంలో గ్రామీణ వైద్యులు తమ పరిధిని దాటకుండా, తమ వద్దకు వచ్చిన రోగులకు ప్రాథమిక వైద్య సేవలు అందించి, క్లిష్టమైన కేసులను దగ్గరలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే విధంగా ప్రోత్సహించాలని డివిజన్ గ్రామీణ వైద్యులందరూ ఏకగ్రీవంగా తీర్మానించారు దసరా సందర్భంగా మూడు రోజులపాటు గ్రామీణ వైద్యులంతా తమ కుటుంబ సభ్యులతో విహార యాత్రకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు చింతూరు డివిజన్ ముంపు మండలాల గ్రామీణ డివిజన్ అధ్యక్షులుగా ఎస్‌కె హనీఫ్, డివిజన్ కమిటీ సభ్యులు టి.చైతన్యప్రసాద్, అనుసూరి శ్రీనివాస్, ములిశెట్టి రమేష్, గణేష్, బి సాగర్, టి వెంకన్న, సత్యనారాయణ, ముచిక నిర్మల, సుబ్రహ్మణ్యం, 60 మంది గ్రామీణ వైద్యులు పాల్గొన్నారు.

పిడత మామిడిలో అగ్ని ప్రమాదం

ప్రజాశక్తి -కొయ్యూరు: మండలంలోని మర్రివాడ పంచాయతీ పిడతమామిడి గ్రామంలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ తాటాకిళ్లు పూర్తిగా కాలిపోయింది. గ్రామానికి చెందిన సుర్ల బాలకృష్ణ తాటాకింటికి ప్రమాదవశాత్తు నిప్పు అంటుకోవడంతో బట్టలు, సామాగ్రి పూర్తిగా దగ్ధమయ్యాయని బాధితులు వాపోతున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన తమను ప్రభుత్వమే ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

పూర్తిగా దగ్ధమైన తాటాకిల్లు

కొండసంత గ్రామస్తులు మట్టుబెట్టిన కొండ చిలువ

భారీ కొండచిలువ హతం

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని మూలపేట పంచాయతీ పరిధిలోని మారుమూల గ్రామమైన కొండసంత గ్రామంలో ఆదివారం కొండచిలువ హల్‌చల్ చేసింది. సాయంత్రం పొద్దుపోయాక సుమారు 15 అడుల భారీ కొండచిలువ గ్రామంలోకి ప్రవేశించింది. దీంతో గ్రామస్తులు హడలిపోయారు. అసలే చీకటి పడుతుండడం, భారీ కొండచిలువ కనిపించడంతో ఆందోళనకు గురైన గ్రామస్తులు, ప్రాణభయంతో కొండచిలువను హతం చేశారు. గతంలో ఇంత పెద్ద కొండచిలువ గ్రామంలోకి ఎప్పుడూ రాలేదని స్థానికులు చెబుతున్నారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT NARSIPATNAM
O.S.NO.47/2022 O.5.R1 & 5

Between :
Kalla Nooka Raju ...**Plaintiff**
And
Thamarba Venkata Ramana
...**Defendants**

To,
Defendants :-
Thamarba Venkata Ramana
S/o Sadha Siva Rao, Teacher
M.P.P.School,Jankaram Puttu (V) Olda (P.O) Hukumpeta (M) A.S.Rama Raju Dist.

SUIT SUMMONS

యిందలి ప్రతివాదిపై O.S.No.47/2022 దావా పరిహారము నిమిత్తం శ్రీ కోర్టువారు ఆదేశము ప్రకారము, మీకు ఎన్ని సార్లు దావా సమన్లు పంపించినను, తీసుకోనందున పేపరు ప్రకటన ద్వారా మీకు సమన్లు పంపడమైనది. సదరు విషయంలో మీకు ఎట్టి ఆక్షేపణలు యున్నాను **తే.06-11-2023 ది ఉదయము 10:30 గంటలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగాని అడ్వకేటు ద్వారా గాని హజరై తమకు గల ఆక్షేపణలు తెలియపర్చవలెను. లేనిచో సదరు విషయమై మీ పై పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురు. అని ఈ Suit summons మూలంగా మీకు తెలియపర్చడమైనది.

H.G.Dt.06-11-2023
Ruthala Apparao
Advocate, 5th Ward,
Narsipatnam **Narsipatnam**
Dt.22-10-2023 **9849830515**

సిఎం వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలి

- సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి-పాడేరు: ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పోరాడే, ప్రజా సమస్యలపై ఆందోళన చేసే వారిని సంఘ వ్యతిరేక శక్తులుగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యాఖ్యలను సిపిఎం అల్లూరి జిల్లా కార్యదర్శి పి.అప్పల నర్స తీవ్రంగా ఖండించారు. ఆదివారం ఆయన ఈ విషయంపై స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేసేవారి గొంతు నొక్కడానికి, ప్రతిపక్షాలను అణచి వేయడానికి చేసే ప్రయత్నంలో భాగమే ఇటువంటి మాటలు అని తీవ్రంగా దుయ్యబట్టారు. పోలీసు అమరవీరుల సభను దీనికి ఉపయోగించుకోవడం దురదృష్టకరం అన్నారు. ఈ నిర్బంధాలు ప్రజాస్వామ్యానికి ప్రమాదమన్నారు. మోడీని వ్యతిరేకించే వారందరూ దేశ ద్రోహులుగా బిజెపి చిత్రీకరించినట్లుగా, మీడియా సంస్థలు, న్యూస్‌క్లిక్ పై దాడులు చేసి జర్నలిస్టులను ఉగ్రవాదులుగా ముద్ర వేసినట్లుగా, రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం కూడా మోడీని అనుసరిస్తున్నట్లుగా అనుమానం కల్గుతోందన్నారు. అసాంఘిక శక్తుల నిర్వచనాన్ని మార్చాలని ఆయన చేసిన ప్రతిపాదన సంఘ వ్యతిరేక శక్తులుగా ముద్ర వేసి ప్రజా సమస్యలపై పోరాడే వారిని అసాంఘిక శక్తులతో కలిపి ముఖ్యమంత్రి పునఃనిర్వచించాలని పిలుపివ్వడం ప్రజాస్వామ్యానికే కళంకమని ముఖ్యమంత్రి తన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాథమిక హక్కుల పరిరక్షణ కోసం ముందుకు రావాలని ప్రజాస్వామ్యవాదులకు, మేధావులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

బొర్రా గుహల్లో పర్యాటకులు

పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి -అనంతగిరి: దసరా సెలవులు కావడంతో ప్రముఖ పర్యాటక కేంద్రాలు కిటకిటలాడాయి. ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రా గుహల్లో ఆదివారం విదేశీ తర ప్రాంతాలకు చెందిన కుటుంబ సమేతంగా సందర్శించి తిలకించారు. గుహల ప్రముఖ్యాన్ని పర్యాటకులకు సిబ్బంది క్షుణంగా వివరించారు. కటికి, తాడిగుడ జలపాతాలను సందర్శించి స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు. కాఫీ ఫ్లాంటేషన్, అరకు సుంకరమెట్ట, యు పాయింట్‌లను సందర్శించారు అనంతగిరి, ఘాట్ రోడ్‌లో వాహన రద్దీ నెల కొనడంతో గంటల తరబడి ఆలస్యం ఏర్పడింది.

అన్నసమారాధన

ఆరిలోవ : ఎర్రిదుర్గ మహంకాళీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పెదగదిలి సాలిపేట ఈశ్వరదేవి నగర్‌లో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి పీఠాధిపతి అభిరామ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమాన్ని తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. పెదగదిలి, చినగదిలి, దీనదయాళ్‌పురం కొండవాలు ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. స్థానిక సంఘం నాయకులు, యువకులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు తదితరులు

కొమరం భీమ్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి- అరకులోయ: స్వాతంత్ర సమర యోధుడు కొమరం భీమ్ 122వ జయంతి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమం గన్నెలలోని ఎమ్మెల్సీ డాక్టర్ కుంభ రవిబాబు ఫామ్ హౌస్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజనుల హక్కులు, చట్టాల కోసం కొమరం భీం పోరాటం నిర్విరామంగా సాగిందన్నారు. ఆయన పోరాట స్ఫూర్తితో ప్రతి ఒకరు ముందుకు సాగవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నైజాం నవాబు బ్రిటీష్ వారిపై విరోచితంగా కొమరం భీమ్ విరోచితంగా పోరాటం చేశారని ఆయన అన్నారు. అదిలాబాద్ జిల్లాలో గోండు గిరిజన తెగలో జన్మించి ఆయన అనేక విప్లవ ఉద్యమాలు చేపట్టారని ఆయన అన్నారు. గిరిజన చట్టాలు, హక్కులు రూపకల్పనలో ఎంతో పోరాటం చేశారని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అరకులోయ ఎంపిటి. వి.త్రినాధరావు, ఉద్యోగ సంఘం నాయకులు మాణిక్యం, వైఎస్ఆర్‌సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొమరం భీమ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రవిబాబు తదితరులు

చింతూరు : విప్లవయోధుడు కొమరం భీం 122వ జయంతిని పురస్కరించుకొని చింతూరులోని కొమరం భీమ్ విగ్రహానికి చింతూరు డివిజన్ ఆదివాసీ జెఎసి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆదివాసీ జెఎసి డివిజన్ చైర్మన్ జల్లినరేష్ మాట్లాడుతూ నిజాంపరిపాలనలో జల్ జంగల్ జమీన్ అనే నినాదంతో ఆదివాసీలకు స్వయంపాలనకు కొమరం భీం ఉద్యమించారన్నారు. కొమరంభీం స్ఫూర్తితో నేటి పాలకులు ఆదివాసీలకు చేస్తున్న అన్యాయంపైనా, వారి హక్కుల సాధనకు ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆదివాసీ జెఎసి వైస్‌చైర్మన్ కీలం తమ్మయ్య, ఆదివాసీ ఉద్యోగసంఘాల అధ్యక్షులు తిమ్మ సాయి వెంకటరమణ, కణితి గణేష్, ఆదివాసీ గిరిజన సీనియర్ నేత సోడె బాలకృష్ణ జెఏసి నాయకులు మడివి రాజు, మిడియం రమణయ్య, తోడం కోటి, ఐట్ల సీతారామయ్య, దుమ్మిరి వెంకటేష్, స్థానిక ఆదివాసీ మహిళలు పాల్గొన్నారు.

బిర్సా ముండా జయంతి పోస్టర్ ఆవిష్కరణ

బిర్సా ముండా జయంతి ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

ప్రజాశక్తి-పాడేరు: నవంబర్ 14, 15 న రెండురోజుల పాటు పాడేరులో జరగనున్న జాతీయ స్థాయి భగవాన్ బిర్సా ముండా 149 జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఏపీ ఆదివాసి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. పాడేరులోని గిరిజన భవనంలో ఆదివారం ఆదివాసి జెఎసి జిల్లా కన్వీనర్ రామారావు దొర అధ్యక్షతన పోస్టర్, కరపత్రం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ముఖి శేషాద్రి, గెమ్మెలి సూకరాజు, జంపారంగి ప్రసాద్, ఆదివాసీ జెఎసి రాష్ట్ర కార్యదర్శి సోనాయి గంగరాజు పాల్గొన్నారు.

తేలియాడుతున్న తామర పూలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక చిట్టివలస - చిల్లపేట నడుమ ఉన్న పెద్ద చెరువులో కొంత భాగం తామర పూలతో చూడ ముచ్చట గొలుపుతోంది. సహజ సిద్ధంగా తామర పూలు తేలియాడుతుంటే అటుగా వెళ్లే వారు కాసేపు ఆగి వాటిని చూసి ముగ్ధులవుతున్నారు. మానవ తప్పిదాల వల్ల కాల్వలు ద్వారా చెరువులోకి వచ్చే వ్యర్థాలతో అప్పుడప్పుడు దుర్వాసన వెదజల్లుతున్న విషయం విదితమే. ఇది ఒక వైపు ఉండగా, మరో వైపు ప్రకృతి పరంగా సహజ సిద్ధంగా చెరువులో తేలియాడే తామర పూలు స్థానికులకు చూసేందుకు సొంపుగా ఉన్నాయి.

చెరువులో తేలియాడుతున్న తామర పూలు

నేరాలు-ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి -మధురవాడ : ఎండాడ దిశ పోలీస్ స్టేషన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందినట్లు సిఐ వై.రామకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... చంద్రంపాలెం దుర్గానగర్‌లో గేదెల హేమలత (32), భర్త గౌరినాయుడు, కుమారుడుతో కలిసి నివాసముంటున్నారు. హేమలత సోదరుడు ఎర్రినాయుడుతో కలిసి ద్విచక్ర వాహనంపై నగరంలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బంధువును పరామర్శించేందుకు వెళ్తున్నారు. ఎండాడ దిశ పోలీస్ స్టేషన్ సమీపంలో వెనుక నుంచి ద్విచక్రవాహనాన్ని బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హేమలత అక్కడికక్కడే మృతిచెందింది. సోదరుడు ఎర్రినాయుడుకు స్వల్ప గాయాలయ్యాయి. సోదరుడు ఫిర్యాదు మేరకు ఎస్ఐ సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : సైన్ ఇన్ బ్లూ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన సమతానగర్‌లో ఏర్పాటుచేసిన క్రికెట్ పోటీలను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన గాజువాక నియోజవర్గ వైసిపి ఇన్చార్జి తిప్పల దేవన్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా సైన్ ఇన్ బ్లూ ఆర్గనైజేషన్ ఆధ్వర్యాన ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైకోర్టు న్యాయవాది అండిబోయిన లక్ష్మి మాట్లాడుతూ, ఈ పోటీల్లో 40 జట్లు పాల్గొంటాయని చెప్పారు. విజేతలకు మొదటి బహుమతిగా రూ.20 వేలు, రెండో బహుమతిగా రూ.12 వేలు, మూడో బహుమతిగా రూ.8 వేలు, షీల్డు ఈ నెల 25వ తేదీన బహూకరించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంతర్జాతీయ క్రీడాకారుడు అండిబోయిన అప్పారావు, రజక కార్పొరేషన్ డైరెక్టర్ ఈగలపాటి యువశ్రీ, గంగులూరి రోజారాణి, గొందేసి ప్రభాకర్‌రెడ్డి, జెర్రిపోతుల గోవింద గౌడ్, కుప్పిలి ప్రసాద్, చీరపు శంకర్, ఫణికుమార్, కమిటీ సభ్యులు భార్గవ్, అనీల్, నరేష్, మనోజ్, అశోక్, ఉదయ్, నవీన్, సాయి, అరవింద్ పాల్గొన్నారు.

తగరపువలస : చిట్టివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో హెచ్‌సిఎల్ క్రికెట్ టోర్నమెంట్‌ను వెంపాద వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు వెంపాడ శ్రీనివాసరెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు శారీరక దారుఢ్యానికి, మానిసికోల్లాసానికి దోహద పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తిరుపతిరావు, క్రీడాకారులు ప్రతాప్, శాంతి, లోవరాజు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనియన్ల స్వతంత్ర పోరాటాన్ని బలపర్చాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పాలస్తీనా జాతీయ విముక్తి పోరాట సంఘీభావ ఉద్యమాన్ని, వాళ్ల స్వతంత్ర పోరాటాన్ని బలపరచాలని, వెంటనే యుద్ధాన్ని విరమించాలని, ఐక్యరాజ్యసమితి తీర్మానాలను ఆమోదించి, స్వతంత్ర పాలస్తీనాను ఏర్పాటు చేయాలని ఇఫ్టూ నాయకులు ప్రసాద్ డిమాండ్‌చేశారు. విశాఖ పౌర గ్రంథాలయంలో జాతీయ విముక్తి పోరాట సంఘీభావ సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ, పాలస్తీనా ప్రజలు ఎదుర్కొంటున్న నిజ జీవిత సమస్యలను వివరించారు. పాలస్తీనా భూభాగాలను కబ్జా చేయడానికి అమెరికా సామ్రాజ్యవాదం మద్దతుతో ఇజ్రాయిల్ దుర్మార్గమైన విధానాలను అనుసరిస్తూ వస్తోందన్నారు. మార్క్సిస్ట్ అధ్యయన కేంద్రం కన్వీనర్ జెవి.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ, అమెరికన్ సామ్రాజ్యవాదం తన స్వార్ధ ప్రయోజనాల కోసం ప్రపంచ దేశాల్లో అనేక ప్రాంతాల్లో తన అనుకూల కేంద్రాలను ఏర్పాటుచేసుకొని ప్రజల మధ్య వివాదాలను సృష్టించిందని, యుద్ధాల ద్వారా ఆయుధాలు అమ్ముకుంటోందని ఆరోపించారు. పాలస్తీనా ప్రజలు సాగిస్తున్న న్యాయమైన పోరాటానికి సంఘీభావం తెలియజేశారు. అమెరికన్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో న్యాయవాది కె.పద్మ, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.లక్ష్మి, మానవ హక్కుల వేదిక ప్రతినిధి శరత్, పౌర ప్రజాసంఘాల వేదిక సమన్వయకర్త చంద్రశేఖర్, భారత బచావో విశాఖ జిల్లా కమిటీ అధ్యక్షులు వేమన పాల్గొన్నారు.

ప్లకార్డులు చూపుతూ అవగాహన కల్పిస్తున్న సభ్యులు

పోలియోపై అవగాహన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైజాగ్‌లోని రోటరీ క్లబ్‌లు బీచ్ రోడ్డులోని వైఎంసిఎ సమీపంలో మెగా పోలియో అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించాయి. ముఖ్య అతిథిగా రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు హాజరయ్యారు. కార్యక్రమంలో రోటరీ జిల్లా 3020 పోలియో ఛైర్మన్ శోభన్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. రోటరక్టర్లు, ఇంటరాక్టర్లు చేపట్టిన ఫ్లాష్‌మాబ్, డ్యాన్సులు ఆకట్టుకున్నాయి. స్కేటింగ్ విన్యాసాలు కట్టిపడేశాయి.

గోడ కూల్చివేత దారుణం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసి 19వ వార్డు జాలారిపేట పరిధిలో సముద్రానికి దగ్గరగాగల రెండు దేవాలయాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం ప్రజాప్రస్థానం పార్టీ వార్డు అధ్యక్షులు బాలు అభ్యర్థన మేరకు ఆ పార్టీ తూర్పు నియోజకవర్గం సమన్వయకర్త తోట ముకుంద్ నిర్మిస్తున్న గోడను కొందరు వ్యక్తులు కూల్చివేయడం దారుణమని ఆ పార్టీ పేర్కొంది. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్టు నాయకులు తెలిపారు.

పుంగనూరు ఏమైనా పాకిస్తానా ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : పుంగనూరు ఏమైనా పాకిస్తానా ? అని మాజీ ఎమ్మెల్యే, టిడిపి దక్షిణ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో అరాచకాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. జగనన్న ఆరోగ్య సురక్ష మొక్కుబడిగా జరుగుతోందని విమర్శించారు.

పాలక రాజారావు మృతికి పలువురు సంతాపం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆకాశవాణి పూర్వ సంచాలకులు పాలక రాజారావు మరణవార్త ఆకాశవాణి విశాఖపట్నం కేంద్రం ఉద్యోగులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రాజారావు మృతి పట్ల ఆయన సహ ఉద్యోగి చంద్రశేఖర్, తదితరులు సంతాపం వ్యక్తం చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్నటువంటి అనేకమంది కళాకారులకు ఆలిండియా రేడియోలో కార్యక్రమాల ద్వారా ఉపాధి కల్పించిన ఘనత రాజారావుకే దక్కుతుందని వారు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో సాంస్కృతిక కళలను అభివృద్ధి పరచడంలో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. ఎయులోని పేద విద్యార్థులకు యువవాణి వంటి కార్యక్రమాలలో అవకాశం కల్పించిన విషయాన్ని గుర్తుచేశారు. ఆకాశవాణి విశాఖపట్నం స్టేషన్ డైరెక్టర్‌గా ఆయన అందించిన సేవలను ఎవ్వరూ మరిచిపోలేరన్నారు. అటువంటి వ్యక్తి గుండెపోటుతో హఠాన్మరణం చెందడం ఉత్తరాంధ్రకు తీరని లోటని అన్నారు. ఇదిలా ఉండగా పాలక రాజారావు సిపిఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరికి క్లాస్‌మేట్ కావడం విశేషం.

ప్రజారక్షణ భేరి యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ములగాడ : నవంబరు 1 నుంచి ప్రారంభమయ్యే ప్రజా రక్షణ భేరి బస్సు యాత్రను జయప్రదం చేయాలని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు పిలుపునిచ్చారు. ఆదివారం క్రాంతినగర్‌లో జరిగిన పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విశాఖ మణిహారమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమ్మకానికి పెట్టి విశాఖ ఊపిరి ఆపేయాలని చూస్తోందన్నారు. ప్లాంట్ అమ్మకం నిలిపివేసే వరకూ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. కార్మికవర్గం అశేష త్యాగాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను యజమానుల కాళ్ల కింద కట్టు బానిసల్లా నిలిపేందుకు ఒడిగట్టడం దారుణమన్నారు. లేబర్ కోడ్స్ రద్దుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలన్నారు.

రంగంలోకి రియల్టర్లు

- అసైన్డ్ భూమి కొనుగోలుకు ఒప్పందాలు
- హక్కు రాగానే బదిలీకి ప్రయత్నాలు
- పిఒటి సవరణతో నాలుగు వేల ఎకరాలకు అర్హత
- సాగుదారులకే యాజమాన్య హక్కు
- క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది సర్వే

రావికమతం మండలం కవగుంటలోని డి పట్టా భూమి (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

పిఒటి చట్ట సవరణతో రియల్టర్లు, రాజకీయ నాయకులు, వారి బినామీలు రంగంలోకి దిగారు. అసైన్డ్‌దారులకు భూమిపై హక్కురాగానే తమ పేరున భూమి బదిలీ జరిగేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. అసలింతకీ జిల్లాలో ఏం జరుగుతోందంటే..

2003కు ముందు పేదలకు ప్రభుత్వాలు వివిధ సందర్భాల్లో పంపిణీ చేసిన భూములపై ప్రభుత్వం కల్పిస్తున్న యాజమాన్య హక్కు జిల్లాలో అతి కొద్ది మందికి లభించనుంది. 1977 ఎపి అసైన్డ్ భూముల చట్టం (ప్రొహిబిషన్ ఆఫ్ ట్రాన్స్‌ఫర్) సవరణ ప్రకారం భూమి పట్టా పొంది 20 ఏళ్లు పూర్తిచేసుకొని, ప్రస్తుతం సాగులో వున్న అర్హత కలిగిన పేదలు నాలుగు వేల మంది వున్నట్లు రెవెన్యూ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. చట్ట సవరణ ప్రకారం వీరికి యాజమాన్య హక్కు లభించనుంది. చట్టం అమలుకు సంబంధించి విధివిధానాల ప్రకారం జిల్లా స్థాయిలో అసైన్‌మెంట్ కమిటీని నియమించనున్నారు. ఈలోపు యాజమాన్య హక్కు కల్పించడానికి అర్హత కలిగిన లబ్ధిదారుల జాబితాను తయారుచేసే పనిలో రెవెన్యూ యంత్రాంగం వుంది. జిల్లాలోని 24 మండలాల్లోని 450 గ్రామాల్లో 48 వేల మంది దళిత, గిరిజన, పేదలకు 69 వేల ఎకరాలను ప్రభుత్వాలు పంపిణీ చేశాయి. ఈ భూమిలోని 39 వేల ఎకరాల వరకూ అన్యాక్రాంతం కావడం, అమ్మకాలు వంటివి జరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు, రాజకీయ నాయకులు, ధనికుల చేతుల్లోకి ఈ భూములు వెళ్లాయి. వీటికి సంబంధించిన అసైన్‌మెంట్ రికార్డులు అందుబాటులో లేవని ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి సర్వేలో రెవెన్యూ సిబ్బంది తేల్చారు. మిగిలిన 30 వేల ఎకరాల్లో డి పట్టా పొంది 20 ఏళ్లు పూర్తి చేసుకొని సాగులోవున్న పేదలు నాలుగువేల మంది వున్నట్లు గుర్తించారు.

సాగులో వున్నవారిలో పట్టాదారులు, వారి వారసులు, కుటుంబ సభ్యులు వున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూమిలో పట్టాదారులు సాగులో వున్నారా? వారసులు లేదా కుటుంబ సభ్యులున్నారా? అమ్మకాలు జరిగాయా? అన్నది క్షేత్రస్థాయిలో రెవెన్యూ సిబ్బంది సర్వే నిర్వహించారు. యాజమాన్య హక్కు పొందడానికి డి పట్టాదారునికి వున్న అర్హతను గ్రామ స్థాయిలో విఆర్ఒ నిర్ధారించి తహశీల్దార్‌కు పంపించారు. తహశీల్దార్ రికార్డులను పరిశీలించి సంబంధిత ఆర్‌డిఒలకు నివేదించారు. తహశీల్దార్లు పంపిన జాబితాలో సగటున ఐదు శాతం వరకు ఆర్‌డిఒలు పరిశీలించి జాయింట్ కలెక్టర్‌కు నివేదించినట్లు తెలిసింది. వివిధ దశల్లో జరిగిన ఈ పరిశీలనలో నాలుగు వేల మందికి యాజమాన్య హక్కు పొందడానికి అర్హతవుందని ఓ నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. ఈ జాబితాకు జిల్లా స్థాయిలో ఏర్పడబోయే అసైన్ కమిటీ ఆమోదముద్ర వేయాల్సివుంది. ఈ కమిటీ ఆమోదం తెలిపాక నిషేధిత భూముల జాబితా (22(ఎ)) నుంచి డి పట్టా భూములను తొలగించనున్నారు. నిషేధిత భూముల జాబితా నుంచి తొలగించాల్సిన భూముల వివరాలను రిజిస్ట్రార్‌కు అధికారులు పంపించనున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

రిజిస్ట్రార్‌కు నివేదించిన తరువాత డి పట్టా భూమి విక్రయించుకొనే హక్కు పట్టాదారునికి రానుంది. ఇదంతా జరగడానికి ఇంకొంత కాలం పడుతుంది. నిషేధ క్లాజును తొలగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో అమ్మకానికి అవకాశమున్న అసైన్డ్ భూముల కొనుగోలుకు రియల్టర్లు, రాజకీయ నాయకులు తమ ప్రయత్నాలు ప్రారంభించారు. అమ్మకం హక్కు రాగానే యాజమాన్య హక్కు బదిలీ చేసుకొనేలా కొంత అడ్వాన్స్‌లు చెల్లించి ఒప్పందాలు చేసుకున్నట్లు ప్రచారం సాగుతోంది. కాలపరిమితి ప్రకారం 20 ఏళ్లు దాటిన అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కు కల్పించే ప్రక్రియ కొనసాగుతుందని రెవెన్యూ అధికారులు అంటున్నారు. డి పట్టా పొందిన భూమిలో 20 ఏళ్లు పూర్తిచేసుకొని ప్రస్తుతం సాగులో వున్నవారికే యాజమాన్య హక్కు కల్పిస్తామని చెబుతున్నారు. అన్యాక్రాంతం చేసిన, డి పట్టా భూమిని కొనుగోలు చేసిన వారిపై కేసులు నమోదుచేస్తామని తెలిపారు.

అన్యాక్రాంత భూములపై పేదలకు హక్కు కల్పించాలి

దళితులు, గిరిజనులు, పేదలకు పంపిణీ చేసిన భూముల్లో అన్యాక్రాంతమైన, అమ్మకాలు జరిగిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పట్టాదారులైన పేదలకు అందజేసి, యాజమాన్య హక్కు కల్పించాలి. అర్హులైన పేదలకు భూమి పంపిణీ చేయాలి.

డి.వెంకన్న,
వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి

వైసిపి హయాంలో చేసిందేంటి ?

ప్రజాశక్తి - కలెక్టరేట్ : గడచిన నాలుగున్నర సంవత్సరాలలో వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు చేసిందేంటో చెప్పాలని తెలుగుశక్తి అధ్యక్షులు బివి.రామ్ డిమాండ్ చేశారు. కేవలం విధ్వంసం, అరాచకాలు, బలవంతపు అరెస్టులు, మానవ హక్కుల ఉల్లంఘన రాష్ట్రంలో కొనసాగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజాభిప్రాయ సేకరణ సమావేశాన్ని ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన నాలుగున్నర సంవత్సరాలలో 11 లక్షల కోట్ల రూపాయలను అప్పులు తీసుకువచ్చి రాష్ట్రాన్ని జగన్మోహన్ రెడ్డి అప్పుల కుప్పగా మార్చివేశారన్నారు. ఆ సొమ్మును ఎక్కడ ఖర్చు చేశారో చెప్పాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. చంద్రబాబును కక్షపూరితంగా అరెస్టు చేయడాన్ని అందరూ ఖండిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురు రాజకీయ నాయకులు, ప్రజలు మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం దిగిపోతేనే రాష్ట్రం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జనసేన కార్పొరేటర్ కందుల నాగరాజు, ఆప్ నాయకులు కృష్ణ భగవానుడు, జై ఉత్తరాంధ్ర పార్టీ నాయకులు ఇ.చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ నాయకులు బోడేపూడి దొరబాబు, బిఆర్ఎస్ నాయకులు జెటి.రామారావు, సన్ మూర్తి, దువ్వి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అజశర్మ, వేదికపై లోకనాథం తదితరులు

సత్యనారాయణ స్ఫూర్తితో..
ప్రభుత్వ రంగ సంస్థల రక్షణకు కృషి

ప్రజాశక్తి - కలెక్టరేట్ : జక్కన సత్యనారాయణ ఉద్యమ స్ఫూర్తితో ప్రభుత్వ రంగ సంస్థల రక్షణ కోసం కృషి చేయాలని సిపిఎం, సిఐటియు నాయకులు ఉద్ఘాటించారు. పోర్ట్ యూనియన్ అధ్యక్షులు జె.సత్యనారాయణ ఉద్యోగ విరమణ, షష్టిపూర్తి కార్యక్రమాలు ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో సాగాయి. ముఖ్య అతిథులుగా హాజరైన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ.అజశర్మ, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడారు. విశాఖపట్నం జిల్లాలో జక్కన సత్యనారాయణ యువకునిగా ఉండగా అందరికీ విద్య అందించేందుకు విద్యా కేంద్రం నడిపారన్నారు. సారా వ్యతిరేక ఉద్యమం నిర్వహించడంలో కీలకపాత్ర పోషించారన్నారు. విశాఖ పోర్టు డిఎల్‌బిలో చేరేటప్పటికి ఒకే ఒక్కడిగా ఆయన సిఐటియులో ఉన్నారని, రిటైర్ అయ్యేటప్పటికి మొత్తం కార్మికులను ఒక తాటిపైకి తీసుకొచ్చి కో-ఆపరేటివ్ సొసైటీకి వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారని తెలిపారు. పోర్టును కాపాడటంలో జక్కన సత్యనారాయణ కీలకపాత్ర పోషించారన్నారు. సభకు సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్ అధ్యక్షత వహించారు. సత్యనారాయణ, రాములమ్మ దంపతులను ఈ సందర్భంగా సత్కరించారు. సత్యనారాయణ తల్లిదండ్రులు సత్యం, ముత్యాలమ్మ, మామ ఎస్.సోములు, కుమార్తెలు వరలక్ష్మి, సత్య, సుగుణ, అల్లుళ్లు వెంకటరావు, భాస్కర్, శ్రీను, వియ్యంకులు వెంకటేశ్వరరావు, పద్మావతి, అప్పారావు చిన్నమ్మలు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, కె.సత్యనారాయణ, కె.స్వతంత్ర కుమార్, బి.లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఘనంగా జర్నలిస్టుల దసరా సంబరాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : విశాఖ అభివృద్ధిలో జర్నలిస్టుల పాత్ర ప్రశంసనీయమని, వారి సహకారంతో మరింత ప్రగతి కోసం అందరం కృషి చేయాల్సిన అవసరముందని రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు అన్నారు. ఆదివారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టు అసోసియేషన్లు సంయుక్తంగా దసరా సంబరాలను ఘనంగా నిర్వహించాయి. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ సమాజం కోసం నిరంతరం జర్నలిస్టులు పాటుపడుతున్నారన్నారు. ఎయు విసి ఆచార్య పివిజిడి.ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఆంధ్ర యూనివర్సిటీ ప్రగతి పథంలో జర్నలిస్టులు కూడా కీలకపాత్ర పోషించారని కొనియాడారు. ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా దసరా సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. ఫెడరేషన్ నగర అధ్యక్షులు పి.నారాయణ మాట్లాడుతూ అందరి సహకారంతో తాము పలు జర్నలిస్టు సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్లు వంటి సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నామన్నారు. దసరా సందర్భంగా మౌనిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా అలరించాయి. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు జి.శ్రీనివాసరావు, నగర కార్యదర్శి బి.అనూరాధ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ఈశ్వరరావు, బ్రాడ్‌కాస్ట్ అధ్యక్షులు ఇరోతి ఈశ్వరరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలు డి.రవికుమార్, ఎ.సాంబశివరావు, ఉపాధ్యక్షులు ఎన్.మధుసూదనరావు, యర్రపోతు రామకృష్ణ, పితాని ప్రసాద్, బి.శివప్రసాద్, రామకృష్ణ, కోశాధికారి సీతారామమూర్తి పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, విశాఖ సమాచారం సంపాదకులు సూరంపూడి వీరభద్రరావు, సీనియర్ ఫొటోగ్రాఫర్‌గా ఉద్యోగ విరమణ చేసిన రఘునాథరావు (విజయ్), రమణారెడ్డి (సాక్షి) డి.రవికుమార్ (సాక్ష్యం), శ్రీహరిరాజు, ఇరోతి ఈశ్వరరావు, జి.శ్రీనివాసరావు తదితరులను ఫెడరేషన్ నాయకులు సత్కరించారు.